కర్నూలు | నంద్యాల
వార్త
22 జూన్, 2024 శనివారం పేజీలు 4

## యోగాతో ఆరోగ్యకరమైన జీవితం : జిల్లా ఎస్పీ జి కృష్ణకాంత్



**కర్నూలు, జూన్ 21, ప్రభాతవార్త:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కర్నూలు జిల్లా పోలీస్ పేరేడ్ మైదానంలో జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ అద్వర్యంలో జిల్లా పోలీసులు యోగా చేసి ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ యోగా సాధన వల్ల కలిగే అనేక ప్రయోజనాల గురించి అవగాహన పెంచడం కోసమే ఈ అంతర్జాతీయయోగా దినోత్సవం అన్నారు. మానసిక, శారీరక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందాలంటే ప్రతిరోజు ఉదయం లేదా సాయంత్రం వేళల్లో, కొద్ది సమయం వెచ్చించి యోగా చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంతో ఉండవచ్చున్నారు. అందరు ఆరోగ్యంగా ఉంటూ కుటుంబంతో సంతోషంగా జీవించాలన్నారు. ఈకార్యక్రమంలో యోగా నిపుణులు ఇంటర్ నేషనల్ అర్ట్ అఫ్ లివింగ్ ఫ్యాకల్టీ ఫారూల్ కురాన, కర్నూలు ఆర్ట్ అఫ్ లివింగ్ ఫ్యాకల్టీ లంక నాగరాజు, అదనపు ఎస్పీలు నాగరాజు, నాగబాబు, మహిళా పిఎస్ డిఎస్పీ బాబు, ప్రసాద్, ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, సిఐలు నాగరాజు యాదవ్, ఇంతియాజ్ బాష, పవన్‌కుమార్, కిరణ్‌కుమార్‌రెడ్డి, గౌతమి, ఆర్ఐలు,ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మీసేవలు మాకేం సంబంధం..
# ఆదోని రెవెన్యూ సిబ్బంది..!

**- ఇంకా నయం చంద్రబాబుకు రెవెన్యూ ఆఫీసుకు ఏం సంబంధం అనలేదు..!**



**ఆదోని, జూన్ 21, ప్రభాతవార్త**
తెలుగుదేశం ప్రభుత్వం ఒకప్పుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మీసేవ కేంద్రాలు ప్రజలకు సేవలు అందించడంలో ఎంతో ప్రగతి సాధించాయి. యావత్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి ఏపి రాష్ట్రంలో మీసేవ కేంద్రాలు సేవలందించడంలో ప్రజలకు చాలా కీలకంగా మారాయి. ఏపిలో గత ప్రభుత్వం మీసేవ కేంద్రాలను కక్ష్యపూరితంగా నిర్వీర్యం చేశాయి. మీసేవ కేంద్రంలో సేవలను తగ్గించడంతో మీసేవ నిర్వాహకుల అసోసియేషన్ హైకోర్టును సంప్రదించారు. హైకోర్టు తీర్పుతో వైసిపి ప్రభుత్వానికి చుక్కెదురైంది. గత్యంతరం లేక మీసేవ కేంద్రాలను అలాగే ఉంచారు కానీ ప్రజలందరు సచివాలయంలో వెళ్లి సర్వీసులను పొందాలని మీసేవలకు వెళ్లకూడదని సచివాలయ సిబ్బంది ద్వారా ప్రచారం చేశారు. మీసేవ కేంద్రంలో అర్జీ పెట్టుకున్న ప్రజలకు సర్టిఫికేట్ జారీ చేయబోమని భయపెట్టారు. దీంతో చాలా మీసేవ కేంద్రాలకు ప్రజలు రాకపోవడంతో గత్యంతరం లేక మూసివేశారు. కానీ మంచి సమయం రాకపోదని కొన్ని మీసేవ కేంద్రాలు అలాగే ఉంచారు. చివరికి ఇప్పుడు సాక్ష్యాత్తు రెవెన్యూ ఆఫీసులోని సిబ్బంది మీ సేవలకు మా రెవెన్యూ ఆఫీసుకు ఏం సంబంధం అంటున్నారు. మామూలుగా అయితే ప్రతి విద్యార్థికి కుల సర్టిఫికేట్ కావాలంటే మీసేవలో అర్జీ పెట్టుకునేవారు. నిర్ణీత గడువులోగ వారికి కుల ఆదాయ సర్టిఫికేట్ మీసేవ కేంద్రం వారే ఇచ్చేవారు. ఈ గడువులో మీసేవ నిర్వాహకులు వారి అప్లికేషన్‌ను మరియు వారు చదువుకున్న విద్యా సర్టిఫికేట్‌ను,ఆధార్ కార్డును స్కానింగ్ ద్వారా మండల రెవెన్యూ కార్యాలయంలో ఉన్న తహశీల్దార్‌కు లాగిన్ ద్వారా ఆన్‌లైన్‌లో పంపుతారు. తహశీల్దార్ కార్యాలయంలో ఉన్న సిబ్బంది వాటిని డౌన్‌లోడ్ చేసి ప్రింట్‌ఔట్ తీసి విఆర్ఓ ద్వారా వెరిఫికేషన్ చేయించి తహశీల్దార్ అనుమతితో సర్టిఫికేట్‌లను మంజూరు చేస్తారు. ప్రజలు ఎటువంటి పరిస్థితుల్లో మండల కార్యాలయాలకు,ప్రభుత్వ కార్యాలయాలకు తిరగకుండ అప్లై చేసిన సర్టిఫికేట్లను మీసేవ కేంద్రంలోనూ లేక ఇప్పుడున్న సచివాలయంలో తీసుకోవచ్చు. కానీ ప్రస్తుతం అలా జరగడం లేదు. ప్రభుత్వ కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యంతో సర్టిఫికేట్లు అప్రూవల్ కావడం లేదు. అందువల్ల ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు ప్రస్తుతం తిరుగుతూ అధికారులను ప్రాధేయపడే పరిస్థితి వచ్చింది. మీ సేవలకు మాకు ఏం సంబంధం అని రెవెన్యూ అధికారులు అంటున్నారంటే చివరికి ఉద్యోగులను ఏ రీతిలో గత ప్రభుత్వం శిక్షణ ఇచ్చి ఉంటారో అర్థమవుతుంది. ఇప్పటికైనా మండల కార్యాలయంలో ఉన్న తహశీల్దార్ సిబ్బందికి ప్రభుత్వం యొక్క భాద్యత ఏమిటో శిక్షణ ఇస్తే బాగుంటుందని ప్రజలు కోరుకుంటున్నారు.

# ఏరువాక సాగారో.. రన్నో సిన్నన్న..!

- ఏరువాకతో వరుణిడి పలకరింపు..
- నైరుతి ఆగమనం.. నాగలికి శుభారంభం..
- రైతన్న కౌగిలి.. నాగలి..
- నేడు ఏరువాక పున్నమి..(హల పౌర్ణమి)..



**కోసిగి, జూన్ 21, ప్రభాతవార్త :**
**రైతు నేస్తానికి ముస్తాబు:**
అన్నదాతలు ఈ పర్వదినాన ఎడ్లు, నాగలి, ఇతర వ్యవసాయ పనిముట్లను పూలు, పసుపు, కుంకుమ, ధూపదీపాలు మొదలైన వాటితో పూజిస్తారు.. ముందుగా ఎద్దులను శుభ్రంగా కడిగి వాటి కాళ్లకు గజ్జలు కట్టి చక్కగా అలంకరిస్తారు.. ఊరు ఊరంతా కదిలి అలా ఎద్దులను, నాగళ్లను తీసుకుని పొలాలకు వెళతారు.. అక్కడ పొంగళ్లను పొంగించి దుక్కి దున్నడం ప్రారంభిస్తారు.. భూమాతను, వారి ఇష్టదైవాలను మనసారా స్మరించుకుని పంట దిగుబడి బాగా ఉండాలని ప్రార్థిస్తారు.. అంతటా ఏరువాక పున్నమిపండుగలా జరుపుతారు.. జిల్లా వ్యాప్తంగా కర్షకుల కుటుంబాలలో ఏరువాక పౌర్ణమి ఉత్సాహభరితమైన పండుగ..ఇక ఎద్దులను పూజించే విషయానికి వస్తే తమ కృషికి సాక్షులుగా తమ కష్టాన్ని పంచుకునే నేస్తాలుగా రైతు ముంగిట కనిపిస్తుంటాయి ఎద్దులు.. వీటిని కేవలం మూగజీవాలుగా రైతన్న భావించడు.. అందుకే ఏరువాక పౌర్ణమి రోజు తాను ఎంత హుషారుగా పొలం పనులకు వెళతాడో అదే మాదిరిగా ఎద్దులను అలంకరించి తన తోటి కుటుంబ సభ్యులుగానే భావిస్తాడు..భూమిలో చల్లిన ప్రతి గింజ కోటి మొక్కలై వర్థిల్లాలని, పాడిపంటలతో తమ ముంగిళ్లు మురిసిపోవాలని, అందరూ చల్లగా ఉండాలని నిండు మనస్సుతో ఏరువాకమ్మని కోరుకుంటాడు.. దుక్కి గల భూమి, దిక్కుగల మనిషీ ఎన్నటికి చెడదు అని కర్షకులు గట్టిగా నమ్ముతారు.. ఈ రోజు ఎంత అవసరమొచ్చినా ఎవరికి అప్పు ఇవ్వరు..పంటలు బాగా పండాలని, వర్షాలు బాగా కురవాలని సిరి ధాన్యాలతో

"నాగరికత ఎంతగా ముందుకు సాగినా నాగలి లేనిదే పని జరుగదు..రైతు లేనిదే పూట గడవదు.. అలాంటి వ్యవసాయానికి సంబంధించిన పండుగే ఏరువాక పౌర్ణమి.. దీనినే హలపౌర్ణమి అని కూడా అంటారు.. వైశాఖ మాసం ముగిసి జేష్టం మొదలైన తరువాత వర్షాలు కురవడం మొదలవుతాయి.. ఒక వారం అటూ ఇటూ అయినా కూడా జ్యేష్టా పౌర్ణమి నాటికి తొలకరి పడక మానదు.. భూమి మెత్తబడక మానదు.. అంటే నాగలితో సాగే వ్యవసాయపు పనులకు ఇది శుభారంభం అన్నమాట.. అందుకనే ఈ రోజున ఏరువాక అంటే దుక్కిని ప్రారంభించడం అనే పనిని ప్రారంభిస్తారు..భారతీయ సంస్కృతికి, జీవన విధానానికి వ్యవసాయం మూల స్థంభం లాంటిది.. దానికి తొలి పనిముట్టు నాగలి..ముఖ్య వనరు వర్షం.. ఆ వర్షం కురిసే కాలం మొదలయ్యేప్పుడు రైతులు కృతజ్ఞతతో జరిపే పండుగ కృషిపూర్ణిమ.. దీనిని హల(నాగలి) పూర్ణిమ, ఏరువాక పున్నమి అనే పేర్లతో పిలవడం జరుగుతోంది... ఏరు అంటే నాగలి అని ఏరువాక అంటే దుక్కిప్రారంభం అని అర్థాలున్నాయి..వ్యవసాయానికి కావాల్సిన వర్షాన్ని కురిపిస్తాడని భావించే ఇంద్రున్ని పూజించడం,నాగలిని పూజించి వ్యవసాయ పనులు మొదలు పెట్టడం జేష్యష్టా పూర్ణిమ పర్వదినం విశేషాలు..ఏరువాక పండుగ అతి ప్రాచీనమైంది.. పూర్వం శ్రీ కృష్ణదేవరాయలు రైతన్నల కృషిని అభినందించి ఏరువాక సమయంలో తగిన రీతిలో రైతులను ప్రోత్సహించినట్లు చరిత్రలు చెబుతున్నాయి..

• వివరాలు 2లో



## కలెక్టరు గారు..
## విద్యాశాఖపై కాస్త లుక్కేయండి..!

- నాడు నేడు కింద వచ్చిన సిమెంటు బస్తాలు కొన్నిమాయం.. మరికొన్ని గడ్డకట్టిన వైనం..
- లక్షల రూపాయలు ప్రభుత్వానికి నష్టం..

**వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నని రోజులు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహారించినట్లు పలు ఆరోపణలు తలెత్తుతున్నాయి. జిల్లాలో విద్యాశాఖపై ఉమ్మడి కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గతకొద్ది రోజులుగా పలు ఆరోపణలు విమర్శలు వచ్చాయి... వస్తున్నాయి. జిల్లా కలెక్టరు.. జాయింట్ కలెక్టరుతో పాటు జిల్లా ప్రజాప్రతినిధులు, జిల్లా మైనార్టీ న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, ఆర్ అండ్ బి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి వంటి వారు ఈ విద్యాశాఖపై ప్రత్యేక దృష్టిపెట్టా ల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటు న్నారు. తాజగా జిల్లాలోని పలు పాఠశాలల్లో నిర్వహిస్తున్న నాడు నేడు పనులపై జరుగుతున్న వాటిలో పలు అవినీతి అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని సోషల్ మీడియాలో వార్తల రూపంలో హాల్‌చల్ చేస్తున్నాయి. నాడు నేడు కింద వచ్చినటువంటి కొన్ని వందల బస్తాల సిమెంటు కొన్ని అనాధికా రికంగా, కొన్ని బస్తాలు అధికారి కంగా, కొందరు వాడుకున్నట్లు, మరికొన్ని వందల సిమెంటు బస్తాలు సంబంధిత ఇంజనీరింగ్, విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యానికి గడ్డకట్టుకుపోయి పనికిరాకుండా పోయాయని సోషల్ మీడియాలో వార్తలు హాల్‌చల్‌చేస్తున్నాయి.**





**నంద్యాల విద్య, జూన్ 21, ప్రభాతవార్త:** జిల్లా విద్యాశాఖాధికారుల పర్యవేక్షన లేకపోవడంతో నాయకుల వత్తిళ్ళకు తలొగ్గి మౌనంగా ఉన్నాయో తెలియదు... నంద్యాల జిల్లాలోని 29 మండలాల్లో ఉన్న పాఠశాలల అభివృద్ధికి గత ప్రభుత్వం నాడు నేడు పనులకు గాను సిమెంటు సరఫరాలో పలు కుంభకోణాలు జరిగాయని ఆరోపణలు వస్తు న్నాయి. ఇందుకు అవుకు మండలం కునుకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 640 బస్తాల సిమెంటు గడ్డకట్టుకొని ఎందుకు పనికిరాకుండా పోయిందని, బనగానపల్లె జూనియర్ కళాశాలలో నాడు నేడు కింద ప్రభుత్వం సరఫరా చేసిన 400 బస్తాల సిమెంటు ఏవరి ఇంటి నిర్మాణానికి ఉపయోగపడిందో తెలియదని, కోవెలకుంట్ల మరికొన్ని ఇతర ప్రాంతాల్లోని పాఠశాలల్లో సిమెంటు బస్తాలు మాయమయ్యాయనే ఆరోపణలు సోషల్ మీడియాలో హాల్‌చల్ చేస్తున్నాయి. నాడు నేడు పనులను పర్యవేక్షించేందుకు..

• వివరాలు 2లో

## యోగాతో శారీరక మానసిక ఒత్తిడిలకు దూరం కండి : జిల్లా కలెక్టరు



**నంద్యాల, జూన్ 21, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రతిరోజు యోగా చేయడం వల్ల శారీరక, మానసిక ఒత్తిడిల నుంచి బయటపడి సమతుల్యమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకోవచ్చని జిల్లా కలెక్టరు డా.కె శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా నంద్యాల ఆయుష్ విభాగం వారు పద్మావతీనగర్‌లోని జిల్లా క్రీడాప్రాదికార సంస్థ ప్రాంగణంలో నిర్వహించిన యోగ శిక్షణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు టి రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి కలెక్టరు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ప్రతిరోజు యోగ క్రమం తప్పకుండా యోగ చేయడం వల్ల శారీరక, మానసిక సామార్థ్యం పెరగడంతో పాటు మనసు, శరీరం సమతుల్యంమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకొని ఆనందంగా జీవించాలన్నారు. మనస్సు శరీరం మధ్య సంయమనం కలుగుచేయడమే యోగ ముఖ్య లక్ష్యమన్నారు. అలాగే శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి వ్యాధుల నుండి బయటపడటానికి అస్కారం ఉంటుందని కలెక్టరు తెలిపారు. అధునిక జీవన శైలీలో భాగంగా ప్రతిఒక్కరు కూర్చొని చేసే పనులు అధికంగా ఉండడం వల్ల నడుం నొప్పి, మేడ నొప్పి దీర్ఘకాలిక వ్యాధులు ఎక్కువ రావడం జరుగుతుందన్నారు. నిరంతరం యోగ చేయడం వల్ల అనేక వ్యాధుల నుండి ఉపశమనం పొందవచ్చన్నారు. ఈవిషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతిఒక్కరు ప్రతి కుటుంబం యోగ చేయడం అలవాటు చేసుకొని శారీరక మానసిక ఒత్తిడిల నుంచి దూరం కావాలని ఆయన అకాంక్షించారు. ఈయోగ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు నిరంజన్‌రెడ్డి, ప్రభుత్వ ఆయుర్వేద మెడికల్ అఫీసరు యశోదర, డిసిహెచ్ఎస్ డా.జప్రుల్లా, జిల్లా క్రీడా ప్రాదికార సంస్థ అధికారి రాజు, ఆయుష్ శాఖ సిబ్బంది నూ క్లియస్ కళాశాల విద్యార్థులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## యోగా సాధన వల్ల ఆరోగ్యమైన జీవితం : జిల్లా ఎస్పీ




**నంద్యాల క్రైం, జూన్ 21, ప్రభాతవార్త:** యోగా సాధన వలన ఆరోగ్యమైన జీవితం లభిస్తుందని మరియు మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందని నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీస్‌కార్యాలయ అవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కొన్నివేల సంవత్సరాల క్రితం పతాంజలి మహార్షి ఎంతో ముందుచుపుతూ సమాజ ఆరోగ్యాన్ని, తరతరాలు బాగుండాలనే ఉద్దేశంతో యోగ అనే చక్కటి ప్రక్రియను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మనకు వచ్చే అన్నిరకాల అనారోగ్యాలు మనకున్న ఒడిదుడుకులతో, పనిఒత్తిడితో ఎనో ఎ సంఘటనలతో రావచ్చు కావునా ప్రతిఒక్కరు యోగాను తనదైనందిన జీవితంలో యోగా సాధన అలవాటుచేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి విద్యతో పాటు యోగ చేయడం వల్ల మానసిక ఉల్లాసాన్ని పొంది ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ధ్యానం మనసును శుద్ధిచేసి ఒక ప్రక్రియని యోగా సాధన వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన పెంచడం జరిగిందన్నారు. ధ్యానయోగ వల్ల ఎంతో ప్రశాంతత చేకూరుతుందని సంపూర్ణంగా జీవించడం ఎలాగో ధ్యానం ద్వారానే అలవడుతుందన్నారు. పోలీసులు విధుల్లో రోజువారి జీవితాలు ఆరోగ్యమానసిక ఒత్తిడికి గురవుతుంటారని యోగా సాధన వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. ఈకార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసులు, నంద్యాల టౌన్ ఇన్‌స్పెక్టర్లు, ఇన్‌స్పెక్టర్లు ఏఆర్ రిజర్వు ఇన్‌స్పెక్టర్లు, నంద్యాల పోలీస్ సబ్‌డివిజన్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రెండు ఎకరాల ప్రభుత్వ భూమి.. కబ్జా..!?

: అమాయక ప్రజలకు భూమిని కట్టబెట్టిన గనులు ఎవరు..?
: ఈ భూ కబ్జాలో ప్రముఖ ముఖ రాజకీయాల హస్తం..?
: అతి త్వరలోనే ప్రముఖుల పేర్లు రియల్‌ఎస్టేట్ వ్యాపారులతో సహా రోజువారి కథనాలతో వెల్లడి..
: డాక్యుమెంటర్ రైటర్ చేతులోనే రాజకీయ నాయకుల వ్యాపారం



**ఆత్మకూరు జూన్21,ప్రభాతవార్త:** నేటి సమాజంలో అంతులేని అవినీతం ప్రజలను మోసం చేసి లక్షల రూపాయాలు సంపాదించుకోని రియల్‌ఎస్టేట్ వ్యాపారం ముసుగులో ప్రభుత్వ భూమి అని తెలసి రిజిస్ట్రేషన్‌లు కాకపోయిన ఆ భూమిని లక్షలో విక్రయాలు జరిపేందుకు షాద్‌నగర్ బాదుషాలు ఆత్మకూరు ప్రాంతంలో ఎందరో ఉన్నారని చెప్పవచ్చు. సబ్ రిజిస్ట్రర్ అధికారుల చేతివాటం, రియల్‌ఎస్టేట్ వ్యాపారుల కమీషన్లు, ఇలా కాసుల కోసం కక్కుర్తి పడుతూ ఏకంగా ప్రభుత్వ భూములను రెండు ఎకరాలను కబ్జా చేసి జోరుగా రియల్ ఎస్టేట్ వ్యాపారంను కొనసాగిస్తున్నారు. ఈ వ్యాపారం వెనుకాల శ్రీశైలం నియోజకవర్గంలోని కొందరు ప్రముఖ రాజకీయ నాయకుల కనుసైగలో ఈ భూమి కబ్జాకు గురైన్నట్లు సమాచారం. అతి త్వరలోనే సర్వే నెంబరులు ఈ భూమిని గతంలో ఏ ప్రజాప్రతినిధి కొనుగోలు చేశారు. ఏ పార్టీ నాయకుడుకి అమ్మారు ఆ నాయకుడి నుంచి ఏ రియల్‌ఎస్టేట్ వ్యాపారి, డాక్యుమెంట్ రైటర్ కొనుగోలు చేశారనే పూర్తి సమాచారం వెల్లడించేందుకు ప్రభాతవార్త పాఠకులకు సమగ్ర సమచారంను అందించడంలో ముందుంటుంది.

## శాసన సభ్యుడిగా ప్రమాణం చేసిన రోడ్డు భవనాల శాఖ మంత్రి



**నంద్యాల, జూన్ 21,ప్రభాతవార్త ప్రతినిధి**
అంద్రప్రదేశ్ రోడ్డు భవనాల శాఖ మంత్రి బిసి జనార్దనరెడ్డి శాసన సభ్యుడిగాప్రమాణం చేశారు.2024 సార్వత్రిక ఎన్నికల తెలుగు దేశం పార్టి తిరుపున బనగానపల్లె నియోజక వర్గంనకు పోటీ చేసిన బిసి జనార్దనరెడ్డి ఎన్నికల్లో సమీప ప్రత్యర్థి కాటసాని రామిరెడ్డిపై 25556 ఓట్ల మెజార్టీతో విజయం సాదించారు. దీనితో తెలుగు దేశం అదినేత బిసికి రాష్ట్ర మంత్రచి వర్గంలో స్థానము కల్పించారు అనంతము రాష్ట్ర క్యాబినెట్లలో అత్యంత కీలక శాఖ అయిన రోడ్డు భవనాల శాఖను బిసికి కట్ట బెట్టారు. అయితే ఎపి శాసన సభ నిబందనల ప్రకారము ఎపిలోని 175మంది శాసన సభ్యుల చేత ప్రోటన్ స్పీఖరు గోరుంట్ల బుచ్చయ్య చౌదరి ప్రమాన స్వీకారము చేయించారు అందులో బాగంగా బనగానపల్లె నియోజక వర్గ శాసన సభ్యుడిగా మంత్రి అయిన బిసి జనార్దనరెడ్డి దైవసాక్షిగా ప్రమాణము చేశారు.

## చాబోలులో కలుషిత నీటి కలకలం

- ట్యాంకులో మృతిచెందిన కోడి
- 30 మంది అస్వస్థత.. అర్థరాత్రి వైద్య శిబిరం ఏర్పాటు





**జూపాడుబంగ్లా, జూన్ 21 ప్రభాతవార్త**
జూపాడుబంగ్లా మండలం చాబోలు గ్రామంలో విషాదం చోటు చేసుకుంది.కలుషిత నీరు తాగి 30 మంది అస్వస్థతకు గురయారు. వీరిలో ఎక్కువ మంది చిన్నారులు ఉన్నారు. గ్రామంలో మూడు రోజుల నుండి ఒక్కొక్కరు వాంతుల విరేచలనాలతో బాదపడుతుండడంతో ఆరోగ్యసిబ్బంది వారికి మందులు పంపిణీ చేశారు. అయితే ఒక్కసారిగా 30 మందిపైగా అస్వస్థతకు గురికావడంతో సమాచారం తెలుసుకున్న వైద్యసిబ్బంది డాక్టర్ గంగాధర్ ఆధ్వర్యంలో గురువారం అర్ధరాత్రి గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి అస్వస్తతకు గురైన వారికి చికిత్స నిర్వహించారు. గ్రామానికి చెందిన నీరజ్, గీతాంజలి,సాయి,శ్వేత,హానీ, సుంకన్న, చిట్టెన్న, ధాత్రి, రోహిత్,నడిపి నాగన్న,మహేష్, నవీన్, దర్గయ్య, చిన్న నాగన్న, చిన్న నాగమ్మ,బేనిత, నరేంద్ర, సుంకన్న, కిశోర్, రవి, రాజు, లింగస్వామి, విజయ్, దక్షిత, అభి, పుల్లయ్య, రుషి,సుజ్ఞానమ్మ, మరియమ్మలు కలుషిత నీరు తాగి వాంతులు,విరేచనాలతో అస్వస్థతకు గురైయారు. అస్వస్థతకు గురైన కొందరు నందికొట్కూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లాగా, మరికొంత మంది 80 బన్నూరు, జూపాడుబంగ్లా గ్రామాల్లోని ప్రయివేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నారు. మరి కొంత మంది స్థానికంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలోనే చికిత్స చేయించుకున్నారు. శుక్రవారం ఉదయం అంగన్‌వాడీ సమీపంలోని వాటర్ ట్యాంకులో మృతిచెందిన కోడి కనపడడం, చర్చి సమీపంలో వున్న ట్యాంకుల్లో చెత్తాచెదారం కనపడడంతో ప్రజలు భయాంధోళనకు గురైయారు. గ్రామ పంచయితీ అధికారులు నీటి సరఫరాపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కలుషిత నీటితో అమాయక ప్రజలు అస్వస్థతకు గురికావడంతో అప్పటికపుడు హడావుడి చేసే అధికారులు అపై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో అమాయకుల ప్రాణాలకు భద్రత లేకుండా పోతుంది.
వైద్యశిభిరాన్ని అదనపు జిల్లా వైద్యాదికారి శారదాబాయి...

2లో

## ఛలో గుంటూరు

**కర్నూలు హాస్పిటల్,జూన్ 21, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 18వ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని శాఖ అధ్యక్షులు బాలు నాయక్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు అబ్రహం, సెక్రెటరీ ఖాజామొద్దీన్, ట్రెజరర్ సురేష్, యూనియన్ నాయకులు హరిచంద్ర నాయుడు, శేషిరెడ్డి, రమేష్, నరసింహులు, మల్లిఖార్జున, ఉరుకుందయ్య, శ్రీనివాసులు, రంజిత్, రాజు, సుగుణమ్మ, సుశీలమ్మ, భాగ్యమ్మ, గీతా కళ్యాణి, జయలక్ష్మీ, మంగమ్మ, సావిత్రమ్మ, శివలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సెంటర్‌లో యోగా దినోత్సవం



**అవుకు, జూన్ 21, ప్రభాతవార్త:** అవుకు మండలంలోని ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం ఘనంగా యోగా దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా ఐసిడిఎస్ సూపర్ వైజర్ శివమ్మ మాట్లాడుతూ యోగా వల్ల వచ్చే ప్రయోజనాల గురించి పిల్లలకు చెప్పడం జరిగిందని ఆమె తెలిపారు. అదేవిధంగా ప్రతి సంవత్సరం జూన్ 21న యోగా దినోత్సవాన్ని జరుపుకుంటారని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యోగా వల్ల అధ్యాత్మికంగా ఎదుగుతారు

**నంద్యాల క్రైం, జూన్ 21, ప్రభాతవార్త:** ప్రతిరోజు యోగా చేయడం వల్ల జీవితంలో ఆరోగ్యంగా ఉంటారని అంతేకాకుండా అధ్యాత్మికంగా ఎదుగుతారని ఐసిడిఎస్ పిడి నిర్మల పేర్కొన్నారు. శుక్రవారం యోగా దినోత్సవం పురస్కరించుకొని మోడల్ స్కూల్ నందు 300 మంది పిల్లలతో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. మానసికంగా ఎంతో బాగుంటారని సూచించారు. ఈసందర్భంగా పిడి మాట్లాడుతూ సంకల్పంతో యోగా సాధన చేయడం జరిగిందన్నారు. యోగ అభ్యాసనంలో ఎన్నోరకాలు ఉన్నాయన్నారు. అనంతరం యోగ వల్ల జరిగే లాభాలు ఎంటి అనే వాటిపై వివరించారు. ప్రధానంగా ఆడపిల్లల్లో బాలికలకు యోగ చాల ప్రాముఖ్యమైన అంశంగా భావిస్తు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో సిడిపిఓ చంద్రకళ, సూపర్‌వజర్లు నజీరా, విజయ, ఆరోగ్యమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## యోగాతోనే ఆరోగ్యవంతమైన జీవితం



**గడివేముల, జూన్21, ప్రభాతవార ;** శశీరకంగా, మానసికంగా సంపూర్ణ ఆరోగ్యానికి యోగాభ్యాసం సులువైన సాధనమని ఎ రవీంద్రభారతి పాఠశాల యాజమాన్యం వారు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సిద్దార్థ రాజ్ ఆధ్వర్యంలో పాఠశాలలో ఘనంగా యోగా దినోత్సవం నిర్వహించారు. యోగాభ్యాస ప్రదర్శన ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం వారు సుబ్బరాయుడు, రాఘవేంద్ర, పాఠశాల హెచ్‌ఎం వంశీకృష్ణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

– జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో....మండలంలోని గడిగరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులచే యోగాసనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జానపాటి రాజేంద్రప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు దస్తగిరమ్మ, పుష్పకుమారి, నగరి శ్రీనివాసులు, మారెన్న, పీడీ కవిత, యోగామాస్టర్ హరిత తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు యోగాసనాలు వేయించారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ప్రతిరోజూ యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం అలవడుతుందని చెప్పారు.

## యోగా ప్రతిఒక్కరికి దినచర్య కావాలి



**బేతంచెర్ల, జూన్ 21, ప్రభాతవార్త:** ఎన్నోరకాలుగా ఆరోగ్యాన్ని ప్రసాదించే యోగ మనిషిజీవితంలో దినచర్యగా మారాలని యోగా మాస్టర్ అజయ్ భూపతిశర్మ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పలు పాఠశాలల్లో కళాశాలల్లో యోగాసానాలను చేయించడం జరిగింది. అలాగే యోగాసానాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించడం జరిగింది. ప్రపంచమంతా యోగాసానాల వైపు చుస్తుంది అంటే మన ఆచార సాంప్రదాయాలకు ఉన్న విశిష్టతకు ఎంత ప్రాధాన్యత ఉందో ప్రతిఒక్కరం గుర్తించాలన్నారు. యోగా అసానాలను బాల బాలికలకు చిన్నప్పటి నుండే నేర్పించడం ద్వారా శారీర, మానసిక, ధృడత్వంతో పాటు ఆరోగ్యవంతులైన యువతను దేశానికి అందించిన వారమవుతామని వారన్నారు. యోగాను వ్యాప్తి చేసేందుకు ప్రతిఒక్కరు తమవంతు బాధ్యతగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. అయా కార్యక్రమాల్లో నాగమోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, నగేష్, గుంతా వెంకటసుబ్బయ్య గుప్తా, శ్రీను, నాగేశ్వర్‌రావు, మధు, అయా పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీతోనే బీసీల అభివృద్ధి



**చాగలమర్రి ,జూన్ 21, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీతోనే బీసీ వర్గాల అభివృద్ధి జరుగుతుందని దూదేకుల నూర్ బాషా సంక్షేమం సంఘం మండల అధ్యక్షులు టైలర్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ నివాసంలో భార్గవ్‌రామ్ నాయుడును కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల బీసీ సంక్షేమ సంఘం అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలని కోరడం జరిగిందని తెలిపారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు నూర్ బాషా దూదేకుల సంక్షేమ సంఘానికి ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. గతం మాదిరిగానే ఇప్పుడు సంక్షేమ సంఘానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటుచేసి వెనుకబడిన దూదేకులను అభివృద్ధి చెందేందుకు ఆళ్లగడ్డ శాసనసభ్యురాలు భూమా అఖిలప్రియ, భార్గవ్‌రామ్ నాయుడు, భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డిలు కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా బీసీసెల్ స్పోక్‌పర్సన్ సల్ల నాగరాజు యాదవ్, మండల బీసీ సంఘం నాయకులు పీరయ్య, పెద్ద లాలయ్య, లాల్‌బాషా, సమ్మద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వెల్దుర్తి విఆర్వోపై ఫిర్యాదు చేసిన రైతు

**వెల్దుర్తి,జూన్21,ప్రభాతవార్త :** వెల్దుర్తి విఆర్వోపై వెల్దుర్తి గ్రామానికి చెందిన రైతు రంగస్వామి శుక్రవారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉన్న జూనియర్ అసిస్టెంట్‌కు వ్రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ తమ తండ్రి మాదన్న పూజారి నరసింహాచారి వద్ద సర్వేనెంబర్ 442లో 2 ఎకరాల 2 సెంట్ల భూమిని కొనుగోలు చేశాడన్నారు. అప్పటి నుంచి ఆ భూమి తమ అధీనంలో ఉందని వాటికి పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వవలసిందిగా కోరుతూ తహాశీల్దార్ కార్యాలయానికి వెళ్లి విఆర్వోను కోరగా కొంత నగదును ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఆరోపించారు. అందులో కొంత నగదును సైతం తాను ఇచ్చానని మిగతా నగదు ఇవ్వనిదే మీ పని చేయనని చెప్పినట్లు ఆ రైతు తెలిపారు. ఈ విషయంపై విఆర్వోను వివరణ కోరగా ఆ రైతు చెప్పిన మాటలు, చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని అంతా అవాస్తవమన్నారు.

## చాబోలులో కలుషిత నీటి కలకలం

**(మొదటి పేజీ తరువాయి ) :** జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ కాంతారావులు సందర్శించారు. జిల్లా పంచాయితీ అధికారి మంజుల వాణి గ్రామాన్ని సందర్శించి పారుశుధ్యపనులు పర్యవేక్షించారు. అర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేంద్ర అధ్వర్యంలో పరీక్షల నిమిత్తం నీటి శ్యాంపుల్స్ సేకరించి అత్మకూరు ల్యాబ్‌కు పంపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి యశ్వని, హెల్త్‌సూపర్‌వైజర్లు రాముడు, విజయలక్ష్మమ్మ, అరోగ్యసిబ ంది తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి పిజిక్సు మినహా అన్ని పాఠ్యపస్తకాలు పంపిణీ

**కోవెలకుంట్ల,జూన్ 21,ప్రభాతవార్త :** విద్యాసంవత్సరము అరంభములోనే బడిఈడు పిల్లందరికి పాఠ్యపుస్తకాలు అందించామని యంఈఓ వెంకటరామిరెడ్డి చెప్పారు. శుక్రవారము అయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ 3024-25 విద్యాసంవత్సరమునకు గాను కోవెలకుంట్ల మండలంలోని ఉన్న 36 పాఠశాల్లోని విద్యార్థులందరిక పాఠ్యపుస్తకాలు అందించడము జరిగిందని చెప్పారు. అయితే 10వ తరగతిలో ఒక్క పిజిక్సు సబెక్టు మాత్రము అందలేదన్నారు. మండలనాకి మొదటి విడతలో 39870పుస్తకాలు రెండవ విడతలో 7639 పుస్తకాలను ప్రభుత్వం సరఫరా చేయగా వాటిని అయా పాఠశాల ప్రదానోపాధ్యాయులకు అందించగా వారు పిల్లలందరికి పంపిణీ చేవారని చెప్పారు. మండలలోల 36పాఠశాల్లో మొత్తం 3938మంది విద్యా ర్తులు విద్యను అభ్యసిస్తున్నారని వీరందరి పుస్తకాలు అందించామని యంఈఓ వెంకటరామిరెడ్డి చెప్పారు.



## మాతృమూర్తులందరికి పతివ్రత శిరోమణి సావిత్రి అదర్శం

**కర్నూలు విద్య, జూన్ 21, ప్రభాతవార్త:** శుక్రవారం జైష్టశుద్దపౌర్ణమి రోజున హరిచంద్ర శరిన్ నగర్‌లోని శ్రీదుర్గా త్యాగరాజు సీతారామాలయంలో పునీ స్త్రీలందరు మహాపతివ్రత సావిత్రిదేవి వ్రతం పూజ నిర్వహించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు మాళిగి భానుప్రకాష్, శోడషోపాచార పూజ చేయించారు. అనంతరం మహాపతివ్రత సావిత్రి యొక్క కథాశ్రవణం జరిగింది. విశ్వహిందూ పరిషత్ కర్నూలు నగర మాతృశక్తి కన్వీనర్ పావని మాట్లాడుతూ సావిత్రి తన పతి అయిన సత్యవంతుడి అయుష్ ఒక సంవత్సరం మాత్రమే అని తెలిసినా అతని వ్యక్తిత్వం సత్యవ్రత నిష్టను మెచ్చి అతనినే వివాహం చేసుకుందని ఆతని ప్రాణాలు తీసుకుపోతున్న యమధర్మరాజునే అడ్డగించి పట్టుబట్టి తిరిగి తన భర్త ప్రాణాలను వెనక్కి తీసుకుందని నేటి మహిళలకు కూడ పట్టుదల సమయస్పూర్తి కలిగి ఉండాలని తద్వారా ఎంతటి కష్టతుల్యమైన పనినైనా సులభంగా సాధించవచ్చని మహాపతివ్రత సావిత్రి వృత్తాంతం వల్ల తెలుసుకోవచ్చని తెలిపారు. ఈకార్య క్రమంలో ప్రఖండ మాతృశక్తి కన్వీనర్ లావణ్య, దుర్గావాహిని కన్వీనర్ రాజేశ్వరీ, సభ్యులు మాతృశక్తి కమిటీ సభ్యులు మహాలక్ష్మీ, కృష్ణవేణి, ఉమా మహేశ్వరీ, కళ్యాణిబాయి, పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

## పదివేల ఎకరాల్లో వేరుశనగ,పత్తి సాగు

**దేవనకొండ,జూన్ 21,ప్రభాతవార్త :** మే,జూన్ నెలల్లో మండలంలో ఆయా గ్రామాల్లో వేరుశనగ,పత్తి పంటలను ప్రస్తుతం దాదాపు 10వేల ఎకరాలలో సాగు చేయడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి సురేష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో ఆయా గ్రామాల్లో అక్కడక్కడ వాతావరణ మార్పుల వలన పత్తి పంటలు రసం పీల్చు పురుగులైన తెల్ల దోమ,పచ్చదోమ పంటకు ఆశించడం జరిగిందని వేరుశనగ పంట యందు మొవ్వకుళ్లు తెగులు,పచ్చ పురుగు,లద్దె పురుగులు ఆశించడం జరిగిందన్నారు. పత్తిలో ఆశించిన పచ్చదోమ,తెల్లదోమ వంటి రసం పీల్చు పురుగుల నివారణకు థైమెతోక్సమ్ కానీ,ఇమిడా క్లోప్రిడ్ 1.5ఎంఎల్,అసిఫెట్ 1.5గ్రా/1లీటరు నీటిని కలుపుకుని మొక్కలు బాగా తడిచేటట్లు పిచికారి చేసుకోవాలన్నారు. వేరుశనగలో మొవ్వకుళ్లు తెగులు నివారణకు సాఫ్ 1గ్రా/1లీటరు నీరు లేదా టెబుకొనజల్ 1ఎంఎల్/1లీటరు నీటిలో కలిపి బాగా తడిచేటట్లు పిచికారి చేసుకోవాలన్నారు. వేరుశనగలో పచ్చపురుగు,లద్దె పురుగు నివారణకు మోనోక్రోటోఫోస్ 2.5ఎంఎల్/1లీటరు,లేదా ఇమామెచిన్ బెనజోటా 0.5గ్రా/1లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు.

## ప్రతిఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**ఆదోని రూరల్,జూన్ 21,ప్రభాతవార్త :** ప్రతిఒక్కరు తమ ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ అల్లమ్మ గారి సరళమ్మ,అల్లమ్మ గారి పురుషోత్తంరెడ్డిలు అన్నారు. మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో సర్పంచ్ అల్లమ్మ గారి సరళమ్మ ఆద్వర్యంలో అల్లమ్మ గారి పురుషోత్తంరెడ్డి గ్రామంలోని మంచినీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయడం జరిగింది. అలాగే వీధివీధిన తిరిగి గ్రామంలో పారిశుద్ద్య కార్మికుల చేత బ్లీచింగ్ పౌడర్ చల్లడం జరిగింది. మురికి కాలువల దగ్గర మురుగునీరు నిల్వ లేకుండ శుభ్రపరిచి ఎలాంటి అంటువ్యాధులు,దోమలు కానీ ప్రబలకుండ ముందు జాగ్రత్తగా గ్రామంలో బ్లీచింగ్ పౌడర్ చల్లించడం జరిగిందని తెలిపారు. అలాగే గ్రామస్తులకు పారిశుద్ద్యంపై అవగాహన కల్పించారు.

## నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేద్దాం



**మంత్రాలయం,జూన్ 21,ప్రభాతవార్త:** మంత్రాలయం నియోజకవర్గంతో జనసేన పార్టీని మరింతగా బలోపేతం చేద్దామని జనసేన పార్టీ నియోజకవర్గ ఇంఛార్జ్ లక్ష్మణ్ణ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం నియోజకవర్గకేంద్రమైన మంత్రాలయంలో నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్‌ను కలవడం జరిగిందన్నారు. త్వరలోనే నియోజకవర్గ ఇంఛార్జ్‌లకు అపాయింట్‌మెంట్ ఇస్తామన్నారు. ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం కేంద్రంలోనూ. రాష్ట్రంలోనూ ఉన్నందున రాష్ట్రానికి ఎక్కువ నిధులు తీసుకువచ్చి అభివృద్ది చేసేందుకు అవకాశం ఉందన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు తెచ్చి యువకులకు ఉపాధి అవకాశాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. గతఐదు సం.లుగా నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేశామన్నారు. పార్టీలో ఉన్నప్రతి కార్యకర్తకు న్యాయ్యం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జనసేన కార్యకర్తలు,నాయకులు లక్ష్మణ్ణను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చిన్న,సుమిత్ర,ఎర్రిస్వామి,వీరారెడ్డి, రమేష్,నాగరాజు అబ్రహం,ఆలీభాష,వెంకటేష్. వన్నూరి,నరసప్ప,రంగస్వామి,గోవిందు పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



**నంద్యాల, జూన్ 21, ప్రభాతవార్త ప్రతినిధి:** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఆయుష్ యోగా నిర్వాహకులు ఆనంద్ గురూజీ పేర్కొన్నారు. ఆయుష్ యోగ అధ్వర్యంలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని స్థానిక మున్సిపల్ పార్కులోని ఆయుష్ యోగా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధులుగా తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండి ఫిరోజ్, 12 వార్డు కౌన్సిలర్ శ్యాంసుందర్‌లాల్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆనంద్ గురూజీ మాట్లాడుతూ యోగ వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక స్థితి కూడ బాగుంటుందన్నారు. నేటి అధునిక జీవితంలో మనిషి ప్రతిరోజు ఒకగంట పాటు యోగా చేయడం వల్ల తన ఆరోగ్యంగా ఉండటంతో పాటు మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చున్నారు. యోగాతో చిన్న చిన్న రుగ్మతలే కాకుండా క్యాన్సర్‌లాంటి కఠినమైన రోగాలు కూడ నయమయ్యే అవకాశాలు యోగాలు అద్బుతంగా ఉన్నాయని ఆయన వివరించారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం యోగ అభ్యసనం చేయిస్తున్న ఆనంద్ గురూజీని అభినందిస్తు యోగ చేయడం వల్ల తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే కాకుండా మానసిక ఒత్తిడిని తట్టుకోవచ్చని యోగా ఎటువంటి జబ్బులు రావని ప్రతి ఒక్కరు యోగ సాధన చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పురప్రముఖులు, యోగా సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన ఎంఎల్‌ఏ బుడ్డాకు ప్రత్యేకాభినందనలు

**ఆత్మకూరు జూన్21,ప్రభాతవార్త:** శ్రీశైలం నియోజకవర్గంలో ఎంఎల్‌ఏగా శుక్రవారం ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో బుడ్డా రాజశేఖరరెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి, యువ నాయకులు యుగంధర్‌రెడ్డి, ఆత్మకూరు మండల అధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు జట్టి వేణుగోపాల్‌తో పాటు నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖరరెడ్డికి అసెంబ్లీ దగ్గర ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. రెండోసారి ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి కొత్త ప్రభుత్వంలో అసెంబ్లీలో అడుగు పెట్టడంతో శ్రీశైలం నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, విద్యావంతులు, ప్రభుత్వ ఉద్యోగులు, పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## ఏరువాక సాగారోరన్నో సిన్నన్న..!

**(మొదటి పేజీ తరువాయి ) :** ఇల్లు నిండాలని నమ్మిన నేల సస్యశ్యామలం కావాలని కోరుకుంటాడు..ఈ రోజున బండ్లను అలంకరించి, టెంకాయలు సమర్పించి మంగళవాద్యాలతో ఊరేగిస్తారు.. కొన్ని ప్రాంతాల్లో కాడికి ఓ వైపుఎద్దును కట్టి మరోవైపు కాడిని భూజాన వేసుకుని భూమిని దున్నే ఆచారం ఉంది. బియ్యం, బెల్లంతో వండిన పులగాన్ని ఇంద్రుడికి నైవేద్యం పెడుతారు.. ఎడ్లను పరుగెత్తిస్తూ పందేలకు దిగుతారు..జానపద సాహిత్యంలో ఏరువాక పైన ఎన్నో పాటలు ప్రచారంలో ఉన్నాయి..రోజులు మారాయి సినిమాలో కొనరాజు రాసిన 'ఏరువాక సాగారో రన్నోసిన్నన్న..నీ కష్టమంతా తీరెనురో అన్నో సిన్నన్న'.. అలాగే ఈ మట్టిలోనే పుట్టాము..ఈ మట్టీలోనే పెరిగాము..ఈ మట్టిని మించిన దైవం మట్టే కదురా..ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో సాహిత్యాలు ఉన్నాయి..

జ్యేష్ట పౌర్ణమి రోజే ఏరువాక ఎందుకు: సస్యానికి అధిపతి చంద్రుడు.. ఇంకా చెప్పాలంటే నాగలి సారించి పనులు ప్రారంభించడానికి మంచి నక్షత్రం జేష్ట్యా అని జ్యోతిష్యశాస్త్రం చెబుతోంది.. ఆ నక్షత్రంతో చంద్రుడు పూర్తిగా నిండుగా ఉండే రోజు జ్యేష్టా పూర్ణిమ..ఔషధులకి, సస్యానికి అధిపతి అయిన చంద్రుడు జ్యేష్టా నక్షత్రానికి చేరువలో ఉన్న తరుణంలో ఏరువాక పౌర్ణమ శుభఫలితాలను అందిస్తాడు.. అందుకే జ్యేష్టా పూర్ణిమనాడు మొదటి సారిగా పొలాన్ని దున్నడం ఆనవాయితీ..

పంటపొలం దైవక్షేత్రం: పంచభూతాత్మకమైన ప్రకృతిని దైవంగా ఆరాధించడం భారతీయుల సంప్రదాయం.. భూమిని భూమాతగా కొలుస్తారు..వ్యవసాయం మానవ మనుగడకు జీవనాధారం.. అందుకే దీన్ని యజ్ఞంలా పవిత్రంగా భావించి చేస్తారు.. ముఖ్యంగా పొలంగట్లపై చెప్పులతో నడుస్తారు కానీ, పొలాలు లోపలకు దిగేటప్పుడు మాత్రం చెప్పులు వేసుకోరు.. ఎందుకంటే ఈ పొలంఅనగా భూక్షేత్రం దైవసమానంగా భావిస్తారు..అందుకే వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు ముందు భూమిపూజ చేయడంఅనాధిగా వస్తున్న ఆచారం.. జ్యేష్టా పున్నమి రోజు రైతులు ఎడ్లను కడిగి కొమ్ములకు రంగులు పూసి గజ్జెలు, గంటలతోఅలంకరించి పూజిస్తారు..వాటికి భక్ష్యాలు సమర్పించి మేళతాళాలతో ఊరేగిస్తారు..

## కలెక్టరు గారు..విద్యాశాఖపై కాస్త లుక్కేయండి..!

**(మొదటి పేజీ తరువాయి ) :** అధికారులకు ప్రభుత్వం వాహనా లను సమకూర్చినప్పటికి ఆ వాహనాల్లో అధికారులు ఎక్కడెక్కడ పర్యటించారో? ఏ వేడుకలకు హాజరయ్యారో? వాహనాలు నడిపిన డ్రైవర్లకు వారి లాగ్ బుక్‌లో రికార్డులను పరిశీలిస్తే తెలుస్తోంది. అధికారులు ఏసి గదుల్లో మీటింగ్‌లు, సమావేశాలు అంటూ కాలక్షేపం చేస్తు సిమెంటు బస్తాల విషయాన్ని పట్టించుకోక పోవడంతో ప్రభుత్వానికి భారీ లక్షల రూపాయల్లో నష్టం వాటిల్లిందని అనే వార్తలు పుంకాన పుంకాలుగా సోషల్ మీడియాలో వస్తున్నాయి. జిల్లా కలెక్టరు, జాయింట్ కలెక్టరు వంటి అధికా రులు దీనిపై దర్యాప్తు చేయాలని టీచర్ల సంఘాలు, పేరెంట్స్ టీచర్స్ కమిటీ సభ్యులు, ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతు న్నారు. నాడు నేడు పనుల్లో సంబంధిత ఇంజనీర్లు విద్యాశాఖ అధికారులు కమ్మక్కు అయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈవిషయంపై ఇంచార్జీ జిల్లా విద్యా శాఖాధికారి కొండా సుధాకర్‌రెడ్డిని వివరణ కోసం ఫోన్‌లో సంప్రదిం చగా ఫోన్ లిఫ్ట్‌చేయకపోవడం విశేషం. డిప్యూటి డిఈఓ మహ బూబ్ బేగ్‌ను వివరణ అడగ్గా నాడు నేడు పనులకు సంబంధించి జిల్లా అంతటికి సెక్టోరియల్ అధికారిని పారాయణం లలితకుమారి చూస్తు న్నారని తెలిపారు. సెక్టోరియల్ అధికారిని పారాయణం లలితకు మారిని ప్రభాతవార్త వివరణ అడగ్గా కునుకుంట్ల పాఠశాలలో ఉన్న 640 సిమెంటు బస్తాలను బనగానపల్లె లోని ప్రభుత్వ జూనియర్ కళాశా లకు 400 బస్తాలు పంపించామని మిగిలిన బస్తాలు అక్కడ ఫ్లోరింగ్‌కు ఉపయోగిస్తున్నట్లు అక్కడి అధికా రులు తెలిపారని ఈవిషయం జిల్లా కలెక్టరుకు నివేదిక పంపుతున్నా మని తెలిపారు.

## ఈ ఏరువాక పున్నమి రైతుల జీవితాల్లో వెలుగులు నింపాలి



**కర్నూలు రూరల్,జూన్ 21,ప్రభాతవార్త :** ఈ ఏరువాక పున్నమి రైతుల జీవితాల్లో వెలుగులు నింపాలని ఏపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ అన్నారు. రైతుసంఘం ఆద్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని ఉల్చాల గ్రామంలో ఏరువాక పున్నమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు బాగా కురుస్తాయని రుతుపవనాలు బాగా వస్తాయని వాతావరణ కేంద్రం తెలియజేస్తుందన్నారు. వర్షాలు బాగా కురిసి రైతులు వేసిన పంటలు బాగా పండి మంచి గిట్టుబాటు ధరలు లభించాలని ఆయన కోరుకున్నారు. ఏరువాక పున్నమి సందర్భంగా ఎద్దులను ఎద్దుల బండ్లను అలంకరించి తప్పెట్లతో ఊరేగింపు నిర్వహించిన రైతులను రైతుసంఘం నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా,రైతుసంఘం గ్రామ కార్యదర్శి ఇస్మాయిల్,రైతుసంఘం నాయకులు వెంకటయ్య,బడేసాహెబ్, లక్ష్మన్న,లోకన్న,రామన్న,సీతారాముడు,సుధాకర్, మద్దిలేటి, కృష్ణ,రైతులు,యువకులు పాల్గొన్నారు.

## తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ స్కూళ్లకు పరిమితం చేయాలి



**ఆదోని రూరల్,జూన్ 21,ప్రభాతవార్త :** తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే పరిమితం చేయాలని,ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం సహకరించాలని ఎస్‌టియు రాష్ట్ర సహా అధ్యక్షులు సి నాగరాజు,రాష్ట్ర కౌన్సిలర్ ఈరచంద్ర యాదవ్‌లు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగానికి గొడ్డలిపెట్టుగా మారిన జీఓ నంబర్ 117ను రద్దు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జీఓ 117ను రద్దు చేసి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను కొనసాగిస్తామని ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీకి అనుగుణంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విలీనాన్ని రద్దు చేయాలన్నారు. 1-5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలను పాత పద్దతిలో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొన్ని అనాలోచిత నిర్ణయాల వల్ల గత రెండేళ్లలో 8లక్షల మందికిపైగా విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లారని వివరించారు. ఉన్నత పాఠశాలలు 6-10వ తరగతి వరకు ప్లస్ టు వరకు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఆంగ్ల మాద్యమంతో పాటు తెలుగు మాద్యమాలను కొనసాగించాలన్నారు. ఆదోని పట్టణ శాఖ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కె రవి,ఎస్ భీమరాజులు మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండ ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు కొనసాగేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. మెగా డిఎస్‌సిపై సిఎం చంద్రబాబు సంతకం చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. వీలైనంత త్వరగా నియామకాలు చేపట్టాలన్నారు. 12వ పిఆర్‌సి అమలు పరిచేలోపు ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాల నాయకులను సమావేశ పరిచి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎస్‌టియు పట్టణ శాఖ నాయకులు లోక్యానాయక్,రామయ్య,ప్రహ్లాద,సుధాకర్‌బాబు ,భాస్కరాచారి, నాగేష్, ప్రసాద్,కళ్యాణ్‌రావు,విజయ్,వెంకట రామిరెడ్డి,నాగేంద్రగౌడ్,శ్రీరాములు పాల్గొన్నారు.

## పద్మశ్రీ విద్యాసేవలు మరువలేనివి



**పత్తికొండ,జూన్ 21,ప్రభాతవార్త :** పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయురాలు పద్మశ్రీ సేవలు మరువలేనివని ప్రధానోపాధ్యాయురాలు భ్రమరాంబ అన్నారు. శుక్రవారం తెలుగు ఉపాధ్యాయురాలు పద్మశ్రీ పదవీ విరమణ వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ దంపతులను ఉపాధ్యాయుని బృందం,విద్యార్థినీలు శాలువా,పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు భ్రమరాంబ మాట్లాడుతూ పద్మశ్రీ విద్యాసేవలు మరువలేనివని ఆమెకు వృత్తిపట్ల ఉన్న అంకిత భావం అమోఘం,అపూర్వమని కొనియాడారు. ఆమె ఎంతోమంది విద్యార్థులను తన ఉద్యోగ ప్రయాణంలో తీర్చిదిద్దారన్నారు. పద్మశ్రీ ఎందరో ఉపాధ్యాయులకు ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం,విద్యార్థినీలు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



**కర్నూలు విద్య, జూన్ 21,ప్రభావార్త:** డా.అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్శిటిలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా యూనివర్శిటిలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు, సిబ్బంది, విద్యార్థులు యోగ అసానాలు చేశారు. ఈసందర్భంగా యూనివర్శిటి రిజిష్టర్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు మాట్లాడుతూ యోగా భారతదేశం యొక్క ప్రాచీన సాంప్రదాయానికి అమూల్యమైన బహుమతి అని పేర్కొన్నారు. ఇది మనసు, మరియు శరీరం యొక్క ఐక్యతను సూచిస్తుంది. ఆలోచన, మరియు చర్య నిగ్రహ, నేరవేర్పు, మనిషి మరియు ప్రకృతి మధ్య సామరస్యం, ఆరోగ్యం మరియు శ్రేయస్సు కోసం సమగ్ర విధానమన్నారు. ఇది వ్యాయామం గురించి కాదు మనం ప్రపంచం మరియు ప్రకృతితో ఏకత్వం యొక్క భావాన్ని కొనుగోనడం అన్నారు. మనజీవన శైలిని మార్చడం ద్వారా మరియు చైతన్యాన్ని సృష్టించడం ద్వారా అది శ్రేయస్సులో సహాయపడుతుందన్నారు. ఇది రోగ నిరోధకశక్తిని పెంపొందిండంలో సహాయపడుతుందని చెప్పారు. అంతర్జాతీయ యోగ దినోత్సవం 2024 యొక్క ప్రాముఖ్యత, స్వీయ సమాజం కోసం యోగ అనే దాన్ని నొక్కిచెప్పారు. ఈకార్యక్రమంలో ఇంచార్జీ ప్రిన్సిపాల్ డా.జహనారా, ఎన్‌ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ బి వెంకటప్ప, ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసరు పాల్ కృపాకర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంచార్జీ ఎంఈఓల నియామకం

**నంద్యాల విద్య, జూన్ 21, ప్రభాతవార్త:** ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలువురు మండల విద్యాశాఖాధికారులు పదవీ విరమణ సందర్బంగా ఖాళీలుగా ఉనన ఆ స్థానాల్లో ఇంచార్జీలను నియమిస్తు కడప అర్జేడి వై రాఘవరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు ఆర్‌సినం.0130/బి2/2024 మేరకు జారీచేశారు. జిల్లాలోని హోలగుంద ఎంఈఓ స్థానంలో కమలాదేవిని నియమించగా ఆమె ఆరోగ్యరీత్యా నాట్‌విల్లింగ్ ఇవ్వడంతో ఆ స్థానంలో ఆలూరు ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎం సత్యనారాయణను ఇంచార్జీగా నియమించారు. కౌతాళం ఎంఈఓగా ఉన్న వర ప్రసాద్ ఈనెలాఖరుకు పదవి వీరమణ అవుతుండడంతో పెద్దకడుబూరు ఎంఈఓ-1గా ఉన్న సువర్ణ సునియాంను ఇంచార్జీగా, నందవరం ఎంఈఓగా ప్రస్తుతం ఉన్న సుదర్శన్‌రెడ్డి విదేశాలకు సెలవుపై వెళ్తున్న కారణంగా గోనెగండ్ల ఎంఈఓ-1గా ఉన్న రామాంజనేయులను ఇంచార్జీగాను, చిప్పగిరి ఎంఈఓగా ఉన్న బాలనాయుడు అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించడంతో ఆ స్థానానికి చిప్పగిరి జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎంగా లతీఫ్‌ను ఇంచార్జీ ఎంఈఓగా నియమిస్తు ఉత్తర్వులు జారీచేశారు. ఈఉత్తర్వులు వెంటనే అమలులోకి వస్తాయని విధుల్లోకి చేరాలని ఆయన అదేశించారు.

## ఆల్ ఇండియా శ్రేష్టలో సత్తా చాటిన విద్యార్థిని



**మద్దికెర,జూన్ 21,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మద్దికెరకు చెందిన పారా రాజేంద్రకుమార్,సుమలతల కుమార్తె పారా షారోన్ గత నెలలో నిర్వహించిన ఆల్ ఇండియా శ్రేష్టలో 75వ ర్యాంకుతో సత్తా చాటింది. పారా షారోన్ మంచి ఫలితాలను సాధించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీరి తండ్రి ప్రభుత్వ చౌకదుకాణ డీలర్,తల్లి మాజీ వాలంటీర్‌గా విధులు నిర్వహిస్తూ ఉండేవారు కూతురు ఇష్టం మేరకే కాంపిటేటివ్ ఎగ్జామ్స్ రాయించడం జరిగిందని వారు తెలిపారు. అలాగే బండారు ధరణి 1000వ ర్యాంకు సాధించడం గమనార్హం.

## దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి హాస్టల్ వసతి కల్పించాలి



**కర్నూలు విద్య, జూన్ 21, ప్రభాతవార్త:** ధరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి హాస్టల్ వసతి కల్పించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు పేర్కొన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి అధ్వర్యంలో స్థానిక సంక్షేమ భవన్ ముందు పెట్టెలతో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులు సోమన్న మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో కెజిబివి, గురుకుల కానీ ఇలా ఉన్నటువంటి హాస్టల్‌లో కూడ విద్యార్థులకు సీట్లు కేటాయించలేకపోతున్నారని మిలినటువంటి ఎస్సీ,ఎస్టి, బిసి హాస్టళ్లను 100 మందిని మాత్రమే చేర్చుకోవాలని నిబంధన పెట్టి విద్యార్థులను పూర్తిగా విద్యకు దూరం చేయడం సిగ్గుచేటన్నారు. విద్యార్థులకు మంచి వసతులు కల్పించాల్సిన అవసరం ఉండేదని కానీ అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా ఏకంగా కర్నూలు నగరంలో 1 నుంచి 10 వరకు చదువుకునే పిల్లలకు హాస్టల్ లేకుండా తొలగించడం ఇదివరకున్నటువంటి పిల్లలను కూడ వేరే ప్రాంతాలకు తరలించడం సిగ్గుచేటైన విషయమని జిల్లా విద్యాశాఖాధికారులు సిగ్గుపడాల్సిన విషయమన్నారు. తక్షణమే నగరంలో బిసి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు హాస్టల్ ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికి హాస్టల్ వసతి కల్పించి విద్యార్థులు చదువుకోవడానికి సహాయపడాలన్నారు. ఈసందర్భంగా స్పందించిన ఎస్సీ సంక్షేమశాఖ అధికారి మాట్లాడుతూ గతంలో ఎస్సీ హాస్టల్ ఉండేదని ఆది ఎందుకు తీసేశారో తెలుసుకొని త్వరలో హాస్టల్ ఏర్పాటుకు చర్యలు చేపడతామని ఆమె హామి ఇచ్చారు.

# వాయిదాల మధ్య పంచాయితీ మార్కెట్ వేలాలు..



**కోసిగి, జూన్ 21, ప్రభాతవార్త :** మేజరు గ్రామ పంచాయితీ కోసిగికి ప్రధాన ఆదాయ వనరులైన మార్కెట్ వేలాలు పాటదారుల వాయిదాల మధ్య కొనసాగింది.. శుక్రవారం గ్రామ పంచాయితీలో సర్పంచ్ సంజిపోగు అయ్యమ్మ అధ్యక్షతన, ఆదోని డివిజనల్ పంచాయతీ అధికారిణి నూర్జహాన్ఆధ్వర్యంలో జరిగిన మార్కెట్ వేలాలకు ఎంపీపీ లవకుశ ఈరన్న, ఇవోపిఆర్ఆర్డి సిరాజుద్దీన్, మేజరు గ్రామ పంచాయతీ కార్యదర్శి తిరుమలేశ్వరరెడ్డి, ఆదోని మండగిరి కార్యదర్శి చంద్రశేఖర్లు పాల్గొన్నారు..పోలీసు బందోబస్తు మధ్య జరిగిన పంచాయితీ వేలాలు పాటదారుల నిరసనల మధ్య కొనసాగింది.. ఈసారి ఏలాంటి రాజకీయ జోక్యం లేకుండానే అందరు వేలాలలో పాల్గొన్నారు..ఈ వేలాలకు సంబంధించి ఎస్ఐ సతీష్కుమార్ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసారు..2024-2025 ఆర్థిక సంవత్సరంకు సంబంధించి 9 నెలల కాలంకు గానూ వేలాలు నిర్వహించారు..కాగా ఈ నేపథ్యంలో పంచాయితీ మార్కెట్ వేలాలు పాడేందుకు పోటీదారులు అనాసక్తి కనపరిచి గతంలో కంటే అతి తక్కువగా పాడడంతో వేలాలను వాయిదా వేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు..వాయిదా వేసినా తాము ముందుకు రాలేమని వేలం పోటీదారులు తేల్చి చెప్పారు..అంతేకాక ఎన్నికల కారణంగా మూడు నెలలు గడిచి పోయాయని, దీంతో వ్యాపారాలు చేసుకునేందుకు వీలు లేకుండా ఉంటుందని, తమకు గుత్త కట్టేవారు ఉండరని, తమకు నష్టం వచ్చే వేలం పాటల్లో పోటీ చేయమని చెప్పడంతో..ఇక చేసేది లేకపంచాయితీ అధికారులు గ్రామ పెద్దలతో పాటు ఇతర పెద్దలతో సుదీర్ఘంగా ఆలోచించి ప్రస్తుతం పాడిన వేలాలకు కాస్తా జమ కలిపి తీసుకోవాలని వేలం పాటదారులకు సూచించారు.. దీనికి పోటీదారులు అందరు సమ్మతించి ముందుకు వచ్చారు. వెంటనే మార్కెట్ వేలాలను పంచాయితీ ఉద్యోగి మధుసూదన్రావు కొనసాగించాడు...ముందుగా వారపు సంతమార్కెట్ను చింతలగేనినర్స రెడ్డి అనే వ్యక్తి రూ.1.30 లక్షలకు పాడి కైవసం చేసుకున్నాడు.. అలాగే బండిమెట్టను కూడా అందరి సమ్మతితో అదే పోటీదారుడు చింతలగేని నర్సా రెడ్డి రూ.6.90 లక్షలకు అధికారులు అంగీకరించగా దానిని స్వాధీనం చేసుకున్నాడు..ఇక చిన్నకమేలాను నూరుబాష రూ.30వేలకు, పెద్ద కమేలా వేలం కోసం ఎవరు ముందుకు రాకపోవడంతో దానిని వాయిదా వేయాలని అనుకున్నసమయంలో సంజిపోగు రాజేష్ అనే వ్యక్తి ముందుకు రాగా రూ.20 వేలకు అంటగట్టారు..కాగా మొత్తం మీద ఈ సారి పంచాయితీకి వేలాలు ద్వారా రూ.8.70 లక్షలు అతి తక్కువ ఆదాయం లభించింది.. వేలాలకు సంబంధించి 2024 జూలై నెల 1వ తేది నుండి 2025 మార్చి 31వ తేది వరకు అనగా 9 నెలలు పాటు ఉంటుందని, ముందుగా వేలాలను కైవసం చేసుకున్న వారు పాడిన మొత్తంను చెల్లించిన తరువాతే వాటిని తీసుకోవాలని డివిజనల్ పంచాయతీ అధికారిణి నూర్జహన్ సూచించారు..గతంలో నిర్వహించిన వేలాలలో సుమారు రూ.21.23లక్షలు ఆదాయం సమకూర్చగా ఈ సారి జరిగిన పంచాయితీ మార్కెట్ వేలాలలో సుమారు రూ.12.53లక్షలు ఆదాయం గణనీయంగా తగ్గినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

## జయసూర్య అనే నేను..
## నందికొట్కూరు ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ప్రమాణస్వీకారం



**నందికొట్కూరుటౌన్, జూన్ 21, ప్రభాతవార్త :** జయసూర్య అనే నేను.. అంటూ నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా గిత్తా జయసూర్య శుక్రవారం అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేశారు. జయసూర్య ప్రమాణస్వీకారం చేయడం పట్ల తెలుగుదేశం పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల్లో నందికొట్కూరు నియోజకవర్గ తెదేపా అభ్యర్థిగా జయసూర్య పోటీ చేస్తాడని నంద్యాల పార్లమెంట్ తెదేపా ఇన్చార్జ్ మాండ్ర శివానందరెడ్డి మిడుతూరులో జరిగిన సమావేశంలో ప్రకటించినప్పటి నుంచి జయసూర్య పేరు ప్రకటన పట్ల కొందరు జయసూర్యను ఇబ్బంది పెట్టే విధంగా పుకార్లు షికార్లు చేసేలా సోషల్మీడియాను వాడుకున్నారు. జయసూర్యను చివరి నిమిషంలో తప్పించి తెదేపా అభ్యర్థిగా మరొకరి పేరు ప్రకటిస్తారంటూ వదంతులు సృష్టించారు. నామినేషన్ వేసే ముందు కూడా ఇలాంటి వదంతులనే వ్యాపింపజేశారు. అయితే నంద్యాల పార్లమెంట్ తెదేపా ఇన్చార్జ్ మాండ్ర శివానందరెడ్డి ఎప్పటికప్పుడు అసత్య అరోపణలను ఖండిస్తూ జయసూర్య విజయం కోసం క్షణం తీరిక లేకుండా నియోజకవర్గంలో పర్యటించారు. ఎవరు ఎన్ని వదంతులు సృష్టించినా పార్టీ నాయకులు, కార్యకర్తలు జయసూర్య విజయం కోసం కృషి చేయండని నాయకులు, కార్యకర్తలకు గట్టి భరోసా ఇచ్చారు. జయసూర్య విజయం కోసం మాండ్ర కుటుంబంలోని ప్రతి ఒక్కరు కృషి చేశారు. మాండ్ర సోదరుడు మాండ్ర లింగారెడ్డి సైతం చిన్న పిల్లాడిలా రెట్టించిన ఉత్సాహంతో గ్రామాల్లో పర్యటించి పార్టీ శ్రేణులను వెంట బెట్టుకుని ఇంటింటికి తిరిగి జయసూర్య విజయం కోసం కృషి చేశాడు. మాండ్ర శివానందరెడ్డి సతీమణి మాండ్ర ఉమాదేవి కూడా జయసూర్య విజయం కోసం ప్రచారంలో పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో ముఖ్యంగా అన్ని మండలాల్లో నాయకులు సీనియర్, జూనియర్ అనే తేడాలు లేకుండా అందరూ కలిసిమెలిసి పని చేశారు. నంద్యాల జిల్లాలో అధికార వైసీపీకి మంచి పట్టు ఉంది అని భావించిన నందికొట్కూరులో తమ అభ్యర్థి జయసూర్యను భారీ మెజారిటీతో గెలిపించుకుని మాండ్ర శివానందరెడ్డి రాజకీయంగా ఒక అడుగు ముందుకేశాడని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మొత్తంమీద మాండ్ర కష్టానికి ఫలితమే జయసూర్య గెలుపు అని తెదేపా పార్టీ నాయకులు పేర్కొంటున్నారు.

## ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సాక్షిగా ప్రమాణ స్వీకారం



**ఆత్మకూరు జూన్21,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సాక్షిగా శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో అసెంబ్లీ స్పీకర్కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శ్రీశైలం నియోజకవర్గం నుంచి రెండో సారిగా ఎంఎల్ఏగా అసెంబ్లీలో అడుగు పెట్టి శ్రీశైలం నియోజకవర్గ అభివృద్ధి పైనే దృష్టి సారించనున్నారు. ముఖ్యంగా నియోజకవర్గ ప్రజలు నమ్మకంతో ఎంఎల్ఏగా గెలుపించుకోవడంతో ప్రజలకు అండగా నిలచి అన్ని విదాలుగా అభివృద్ధి చేసే విదంగా అడుగులు వేయనున్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు విద్యా, వైద్యం, అభివృద్ధితో పాటు పలు సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరవేసే విదంగా టిడిపి ప్రభుత్వం ముందుకు వెళ్లనుంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర వ్యాప్తంగా 161 అసెంబ్లీ స్థానాలలో అమరావతిలోనే గెలుపొందిన ఎంఎల్ఏలు, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మంత్రులు అందరు కలసి అసెంబ్లీలో మరోసారి అడుగు పెట్టడం జరిగింది.

## సబ్సిడీ విత్తనాలు రైతులకు అందించాలి ; జేసీ



**మిడుతూరు, జూన్21, ప్రభాతవార్త;** ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయదారులకు సబ్సిడీ విత్తనాలు సకాలంలో అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్కుమార్రెడ్డి వ్యవసాయ అధికారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని చౌట్కూరు, మాసపేట గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్బీకేల ద్వారా మండలానికి సరిపడ్డ విత్తనాలను ప్రభుత్వం అందించడం జరిగిందన్నారు. ప్రభుత్వం అందించే రాయితీ విత్తనాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అక్కడే ఉన్న రైతులను విత్తనాల పంపిణీ గురించి జేసీ ఆరా తీయగా తమకు విత్తనాలు సకాలంలో వ్యవసాయ అధికారులు అందిస్తున్నారని రైతులు ఆయనకు తెలిపారు. అనంతరం జేసీ ఆధ్వర్యంలో రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.పీరునాయక్తో పాటు ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## అహోబిలంలో బైరెడ్డి రాజశేఖర్రెడ్డి ప్రత్యేక పూజలు

**-తిరుపతి-శ్రీశైలం అధ్యాత్మిక వైష్ణవ శైవ క్షేత్రాల కారిడార్ ఏర్పాటు చేయాలి**



**నంద్యాల, జూన్ 21, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆళ్లగడ్డ నియోజకవర్గంలో నల్లమల అరణ్యంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్రెడ్డి ప్రత్యేక పూజలుచేశారు. ఆలయ మర్యాదలతో బైరెడ్డికి అధికారులు స్వాగతం పలికి ఎగువ అహోబిలంలో శ్రీలక్ష్మీనరసింహాస్వామి మూలవీరాట్కు, దిగువ అహోబిలంలో ఉత్సవమూర్తులను బైరెడ్డి దర్శనం చేసుకున్నారు. ఆలయ పూజారి బైరెడ్డిని శాలువతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి-శ్రీశైలం పుణ్యక్షేత్రాలను కలుపుతూ నల్లమల ప్రకృతి అందాలను ఆశ్వాదించేలా వైష్ణవ శైవక్షేత్రాల దర్శనం కారిడార్ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలని కోరారు. తన పార్లమెంటు సభ్యురాలుగా తన కూతురు బైరెడ్డి శబరి విజయం సాధించడంతో అహోబిలంలో స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నామని ఎంపీ బైరెడ్డి శబరితో ఈపుణ్యక్షేత్రాల కారిడార్కు కృషిచేస్తామన్నారు.

## ఎన్నికల్లో విధులకు గైర్హాజరయిన ఉపాధ్యాయుల సస్పెన్షన్ ఎత్తివేత

**నంద్యాల విద్య, జూన్ 21, ప్రభాతవార్త:** ఈఏడాది ఏప్రిల్లో జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు సార్వత్రిక ఎన్నికల శిక్షణకు, విధులకు గైర్హాజరయిన ఉపాధ్యాయులు, ఉద్యోగులను ఉమ్మడి జిల్లా కలెక్టరు డా.సృజన ఎన్నికల కమిషన్ అదేశాల మేరకు సస్పెండ్ చేశారు. తిరిగి ఉద్యోగులు, ఉపాధ్యాయుల జాయింట్ యాక్షన్కమిటీ, ఉద్యోగులు, ఉపాధ్యాయుల విన్నపం మేరకు సస్పెండ్ అయిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల సస్పెన్షన్ తీసివేస్తు వారిని విధుల్లో చేర్చుకోవాలని అయా శాఖల ఉన్నతాధికారులకు జిల్లా కలెక్టరు డా.జి.సృజన ఆర్సి నం.ఏ1/272/2024 మేరక ఉత్తర్వులు జారీచేశారు. వీరిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## ఇంచార్జీ ఎంఈఓల నియామకం

**నంద్యాల విద్య, జూన్ 21, ప్రభాతవార్త:** ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలువురు మండల విద్యాశాఖాధికారులు పదవీ విరమణ సందర్భంగా ఖాళీలుగా ఉనన ఆ స్థానాల్లో ఇంచార్జీలను నియమిస్తు కడప అర్జేడి వై రాఘవరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు ఆర్సినం.0130/బి2/2024 మేరకు జారీచేశారు. జిల్లాలోని హోలగుంద ఎంఈఓ స్థానంలో కమలాదేవిని నియమించగా ఆమె ఆరోగ్యరీత్యా నాట్విల్లింగ్ ఇవ్వడంతో ఆ స్థానంలో ఆలూరు ప్రభుత్వ హైస్కూల్ హెచ్ఎం సత్యనారాయణను ఇంచార్జీగా నియమించారు. కౌతాళం ఎంఈఓగా ఉన్న వర ప్రసాద్ ఈనెలాఖరుకు పదవి వీరమణ అవుతుండడంతో పెద్దకడుబూరు ఎంఈఓ-1గా ఉన్న సువర్ణ సునియాంను ఇంచార్జీగా, నందవరం ఎంఈఓగా ప్రస్తుతం ఉన్న సుదర్శన్రెడ్డి విదేశాలకు సెలవుపై వెళ్తున్న కారణంగా గోనెగండ్ల ఎంఈఓ-1గా ఉన్న రామాంజనేయులను ఇంచార్జీగాను, చిప్పగిరి ఎంఈఓగా ఉన్న బాలనాయుడు అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించడంతో ఆ స్థానానికి చిప్పగిరి జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎంగా లతీఫ్ను ఇంచార్జీ ఎంఈఓగా నియమిస్తు ఉత్తర్వులు జారీచేశారు. ఈఉత్తర్వులు వెంటనే అమలులోకి వస్తాయని విధుల్లోకి చేరాలని ఆయన అదేశించారు.

# యోగా కళకు నిలయం మన భారతదేశం



**కర్నూలు రూరల్,జూన్ 21,ప్రభాతవార్త :** యోగా కళకు నిలయం మన భారతదేశం అని కోడుమూరు నియోజకవర్గ బిజెపి పార్టీ ఇంచార్జ్ మీసాల ప్రేమ్కుమార్ అన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సూచన మేరకు యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని సూదిరెడ్డి పల్లె గ్రామంలో బిజెపి సీనియర్ నాయకుడు బివి సుబ్బారెడ్డి స్వగృహం నందు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోడుమూరు నియోజకవర్గ ఇంచార్జ్ మీసాల ప్రేమ్కుమార్,మాజీ కన్వీనర్ సద్దల మధుకిషోర్తో పాటు మండలంలోని పూడూరు,నూతనపల్లె, పసుపుల,పి రుద్రవరం,వెంకాయపల్లె,గార్గేయపురం,మిలిటరీకాలనీల్లోని బిజెపి నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై యోగా ఆసనాలు సాధన చేశారు. ఈ సందర్భంగా మీసాల ప్రేమ్కుమార్ మాట్లాడుతూ యోగా శాస్త్రానికి పుట్టినిల్లు మన భారత దేశమని,పూర్వం ఎంతోమంది ఋషులు,మహర్షులు,తపస్వికులు యోగా సాధన చేసి వందల సంవత్సరాలు ఆరోగ్యంగా,అత్యంత దృఢంగా జీవించినట్లు మనకు చరిత్ర చెబుతుందన్నారు. యోగా శాస్త్రం ఒక మతానికో..ఒక కులానికో..సంబంధించినది కాదని ఇది యావత్ భారతదేశానికి సొంతమని అన్నారు. అతి చిన్న వయసులోనే ఒత్తిడికి లోనై అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ముఖ్యంగా గుండె,కిడ్నీ అవయవాలకు సంబంధించిన అనారోగ్యాలతో భాదపడుతున్నారన్నారు. ఈ పరిస్థితులు మనకు చాలా దురదృష్టకరమని నన్ను ఎంతో భాద పెడుతున్నాయని అన్నారు. దేశంలోని యువత సిగరెట్లు,గుట్కాలు,మద్యపానం తదితర చెడు అలవాట్లకు బానిసలై వారి చేతులారా వాళ్ల అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారని ఇది మన దేశ భవిష్యత్తుకు మంచిది కాదన్నారు. మన దేశ సంపద మన భవిత మన యువత అని దీనిని యువత గుర్తించి ప్రతిఒక్కరు యుక్త వయసులో ఏఒక్క చెడు అలవాటుకు లోనుకాకుండ దేశ సేవకు వారి చేతనైన సహాయంగా ఒక మంచి అలవాటును అలవరచుకుని దేశ అభివృద్ధికి యువత పాటుపడాలని కోరారు. యోగా సాధనతో మన శరీరం వజ్రం వలె గట్టి పడుతుందని ఎటువంటి అనారోగ్య సమస్యనైనా యోగా సాధన ద్వారా మనం నయం చేసుకోవచ్చని మనకు యోగా శాస్త్రం చెబుతుందన్నారు. ప్రధాని నరేంద్రమోడీ యోగాకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని యోగాకు 2014లో బ్రాండ్ అంబాసిడర్గా కూడా పనిచేశారని ప్రతి ఏడాది జూన్ 21న ప్రపంచంలోని ఎక్కువ దేశాలు యోగా దినోత్సవాన్ని మన దేశంతో పాటు కలిసి జరుపుకుంటున్నాయన్నారు. యోగా శాస్త్రం దేశంలో కొన్ని లక్షల సంవత్సరాల క్రితం నుంచి అందుబాటులో ఉందని మనకు చరిత్ర చెబుతుందని అందువల్ల యోగా శాస్త్రానికి భారతదేశంలో ఎంతో ప్రాముఖ్యత కలిగినదో దీనిని అందరు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే యోగాను అన్ని వయసుల వారు ఎటువంటి భేదాలు లేకుండ అందరు సాధన చేయవచ్చునని యోగా సాధన చేయడం ద్వారా మన శరీరంలోని ప్రతి అవయవం సక్రమంగా పనిచేస్తుందన్నారు. ముఖ్యంగా యోగాసనం ద్వారా గుండె,మెదడుకు పనితీరు సక్రమంగా జరిగి ఈ రెండు అవయవాలు అత్యంత సమర్థవంతంగా పనిచేస్తాయన్నారు. యోగాను ప్రతిరోజు సాధన చేయడం వల్ల మానవుని ఆయుష్షు పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మండల జనసేన నాయకుడు రాంబాబు,సామాజిక సేవకులు మహేష్,యోగా గురువు బిజెపి నేతలు దుర్గ ప్రసన్న,యమలేష్,గార్గేయపురం శివనాయుడు,మనోహర్,రవికుమార్,ప్రసాద్ తదితరులున్నారు.

# నగర పంచాయితీ చైర్మన్ గిరి పై అధికార పార్టీ కన్నేసిందా

**- పట్టు నిలుపుకునేందుకు పాత పాలక వర్గం ప్రయత్నిస్తుందా**

**- కొన్నేళ్లుగా అధికారం చేపట్టాలనుకున్నా వర్గాల కల నిజమయ్యేనా**



**బేతంచెర్ల ,జూన్ 21, ప్రభాతవార్త:** ఆంగ్లేయుల పాలన నుండే యూనియన్ బోర్డుగా అవతరించి నగర పంచాయితీగా మారిన బేతంచెర్ల నగర పంచాయితీ చైర్మన్ గిరి పై అధికార పార్టీ కన్నేసిందా. గత 90 సంవత్సరాలుగా పంచాయితీ పై కొనసాగిన పట్టు నిలుపుకునేందుకు పాత పాలక వర్గం ప్రయత్నిస్తుందా ఎన్నో ఏళ్లుగా పంచాయితీ పగ్గాలను చేపట్టాలన్నా ఇతర వర్గాల కల నిజమయ్యేనా అన్నది బేతంచెర్లలో హాట్ టాపిక్గా మారింది.

రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో గత ప్రభుత్వంలో ఎన్నుకోబడిన మున్సిపాలిటీ మేయర్లు, నగర పంచాయితీ చైర్మన్లను తమ ఆధీనంలోనికి తెచ్చుకునేందుకు ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుండే పావులు కదపడం మొదలైంది. ఇందులో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇటీవల కర్నూలు మేయర్ పై అవిశ్వాస తీర్మానం పెడతారన్నా వదంతులు సైతం ఊపందుకున్న విషయం విధితమే. బేతంచెర్ల నగర పంచాయితీ రాజకీయాలకు పట్టుకొమ్మగా ఉండడంతో పలుమార్లు అధికారం కోసం పలు పార్టీలు ప్రయత్నించినప్పటికి ఎట్టకేలకు గత 90 సంవత్సరాలుగా బుగ్గన కుటుంబికుల కనుసన్నల్లోనే పాలన కొనసాగుతూ వచ్చింది. 1923లో యూనియన్ బోర్డుగా అవతరించిన బేతంచెర్ల 1953 వరకు కొనసాగింది. ఆ తరువాత పంచాయితీరాజ్ చట్టప్రకారం గ్రామ పంచాయితీగా రూపుదిద్దుకుంది. అనేక సంవత్సరాలపాటు బుగ్గన వంశీయులే పంచాయితీ పాలన కొనసాగించడం జరిగింది. ఇటీవల ఎస్సీ మహిళకు రిజర్వేషన్ కావడంతో బొద్దుల రోజమ్మ అనే మహిళ సర్పంచ్గా ఎన్నికై పాలన కొనసాగించింది. 2019లో రాష్ట్రంలో పలు మేజరు పంచాయితీలను నగర పంచాయితీలుగా మారుస్తూ అప్పటి ప్రభుత్వం జీవో విడుదల చేసింది. అయితే పలు కారణాల చేత బేతంచెర్ల నగర పంచాయితీగా హోదాను దక్కించుకోలేకపోయింది. ఎట్టకేలకు నాటి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్రెడ్డి రాష్ట్రంలోని బేతంచర్ల మేజర్ పంచాయితీతో కలిపి ఏడు మేజర్ పంచాయితీలకు నగర పంచాయితీ హోదా కల్పిస్తూ 2021 జనవరి నెలలో జీవోను విడుదల చేయించడం జరిగింది. దీంతో 2021 అక్టోబర్లో నగర పంచాయితీ ఎన్నికలు జరిగాయి. ఇందులో ఎలాగైనా చైర్మన్ గిరి దక్కించుకోవాలని అప్పటి ప్రతిపక్ష పార్టీ టీడీపీ ఉమ్మడి జిల్లాలోని పెద్ద పెద్ద నాయకులను సైతం వార్డు ఇన్చార్జ్లుగా నియమించి గట్టి పోరాటం చేసింది. నాటి పరిస్థితుల్లో ఆర్థిక మంత్రి సొంత నగర పంచాయితీలోనే టీడీపీ ఆరు కౌన్సిలర్ స్థానాలను సాధించడం సంచలనం రేపింది. అయినప్పటికి చైర్మన్ గిరి మాత్రం అప్పటి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్రెడ్డి వర్గానికే దక్కింది. దీంతో వారి కనుసన్నల్లోనే నగర పంచాయితీ పాలన సైతం ప్రారంభమైంది. అలాగే అభివృద్ధికి సైతం రకరకాలుగా నిధులు వచ్చాయని పాలకులు వెల్లడించడం జరిగింది. అయితే ప్రస్తుతం టీడీపీ రాష్ట్రంలో విజయఢంకా మోగించడంతో ఆరు మంది కౌన్సిలర్లకు మరికొంత మందిని కలుపుకుని చైర్మన్ గిరిని చేపట్టాలని టీడీపీ శ్రేణులు ఉవ్విలురుతున్నట్లు సమాచారం. ఇందుకుగాను పలు వైఎస్సార్సీపీ కౌన్సిలర్లను టీడీపీలో చైర్మన్ గిరిని చేపట్టాలనుకుంటున్న కౌన్సిలర్లు మంతనాలు జరిపినట్లు తెలుస్తుంది. ఎన్నో ఏళ్లుగా తమ ఆధీనంలో ఉన్న పంచాయితీ పాలనను పరులకు పోనివ్వకూడదనే ఉద్దేశ్యంతో వైఎస్సార్సీపీ నాయకులు సైతం తమ కౌన్సిలర్ల వద్దకు వెళ్లి మీకు అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇస్తున్నప్పటికి కౌన్సిలర్లు మాత్రం తాము ఇలానే కొనసాగాలంటే లక్షల్లో డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు చర్చలు ఊపందుకున్నాయి. ఎలాగైనా అధికారంతో కౌన్సిలర్లను తమ వైపుకు తిప్పుకుని బేతంచెర్ల నగర పంచాయితీ చైర్మన్ గిరిని చేపట్టడం ద్వారా ఇప్పటి వరకు కొనసాగిన పాలనలోని అవకతవకలను వెలికితీయడంతోపాటు రాజకీయంగా బలోపేతం అవచ్చని టీడీపీ శ్రేణులు గట్టి ప్రయత్నాలు మొదలేట్టినట్లు తెలుస్తుంది. ఎలాగైనా పట్టును కోల్పోకూడదని పాత పాలక వర్గంతోపాటు ఇతర వైఎస్సార్సీపీ ప్రజాప్రతినిధులు సైతం గట్టిగానే చైర్మన్ గిరిని కోల్పోకుండా ఉండేందుకు పావులు కదుపుతున్నట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా గత కొన్నేళ్లుగా తమ కనుసన్నల్లో కొనసాగుతున్న పాలనను అదే వర్గం యథావిధిగా కొనసాగిస్తుందా ఎన్నో ఏళ్లుగా బేతంచెర్ల పంచాయితీ, నగర పంచాయితీ పై పట్టు సాధించాలని కలలు కంటున్న టీడీపీ శ్రేణుల యత్నాలు ఫలిస్తాయా లేదా అనేది వేచి చూడాల్సిందే.

## డయోరియా నియంత్రణపై పకడ్బందీ చర్యలు తీసుకోండి - కలెక్టరు



**నంద్యాల, జూన్ 21, ప్రభాతవార్త ప్రతినిధి:** డయోరియా నియంత్రణపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు జూలై 1 నుండి ఆగష్టు 31 వరకు స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించేందుకు పకడ్బంది ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టరు డా. కె శ్రీనివాసలు సహా అధికారులు అదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలోని సిఎస్ కానఫ్రెన్స్ హాల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్కుమార్ ప్రసాద్ అతిసారా కేసుల వ్యాప్తి (స్టాఫ్ డయోరియా క్యాంపెయిన్) తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టరేట్లతో విడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్చాంబార్ నుండి జిల్లా కలెక్టరు డా.కె శ్రీనివాసులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. విడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో డయోరియా నియంత్రణ వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు జూలై 1 నుండి ఆగష్టు 31 వరకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించేందుకు పటిష్ట ప్రణాళిక రూపొందించాలని పంచాయితీరాజ్, ఆర్డబ్ల్యుఎస్, వైద్యఆరోగ్య, మున్సిపల్శాఖల అధికారులను అదేశించారు. జిల్లాలో ఎక్కడా అతిసారా కేసులు వ్యాపత ఇ చెందకుండా పకడ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున ఐఈసి యాక్టివిటిలను చేపట్టాలన్నారు. ఆరోగ్యశాఖ సహకారంతో స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు అంగన్వాడీలతో ఓఆర్ఎస్ప్యాకెట్లు/ జింక్ కార్నర్ను ఏర్పాటు చేయాలన్నారు. చిన్నారులతో గ్రోత్మానిటరింగ్ నిర్వహించడంపై అంగన్వాడీ వర్కర్లకు శిక్షణ ఇవ్వడం తక్కువ బరువుఉన్న పిల్లలకు పోషకాహారం అందించడం చేయాలన్నారు. ఎక్కడా అతిసారా కేసులు వ్యాప్తిచెందకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పకడ్బంది చర్యలు చేపట్టాలని అదేశించారు. తాగునీటి వనరుల్లో నీటి కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని పంచాయితీరాజ్, ఆర్డబ్ల్యుఎస్ మున్సిపల్శాఖల అధికారులను అదేశించారు. వివిధ డ్రైన్ల గుండా వెళ్లె త్రాగునీటి పైపుల లీకేజిలను అరికట్టాలని ఓహెచ్ఎస్ఆర్లను కూడ పూర్తిగ తనిఖీచేసి లీకేజిలను నియంత్రించాలని కలెక్టరు అదేశించారు.

# వ్యక్తిగత, సమాజం కొరకు యోగా

**- ఎంపీ బస్తిపాటి నాగరాజు**



**కర్నూలు, జూన్ 21, ప్రభాతవార్త:** వ్యక్తిగత మరియు సమాజం కొరకు యోగ ఎంతో ముఖ్యమని కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు పేర్కొన్నారు.శుక్రవారం అవుట్డోర్ స్టేడియంలో 10వ అంతర్జాతీ యయోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం యొక్క ఆయుష్శాఖ, నగర పాలక సంస్థ జిల్లా కలెక్టరు ఆధ్వర్యంలో నిర్వహించిన మోగ కార్యక్రమానికి ఎంపీ బస్తిపాటి నాగరాజు జిల్లా రెవిన్యూ అధికారి మదుసూదన్రావు, జాతీయయోగ సంఘం సభ్యులు శ్రీదర్రెడ్డి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా యోగా అసోసియేషన్ కె విజయ్కుమార్ వారి బృందం వారు కార్యక్రమానికి హాజరయిన యోగ సాధకులు పాఠశాల విద్యార్థులతో సామూహికంగా యోగసానాలను, కపాలబాతి, ప్రాణాయామం, యోగసానాలు, ధ్యానం వంటి కార్యక్రమాలు చేయించారు. యోగసాధకులు నృత్యంతో కూడిన యోగసానాలు వేసి చూపరులను అకట్టుకున్నారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం అంతర్జాతీయయోగా దినోత్సవం సందర్భంగా ఏదో ఒక నినాదాన్ని పాటిస్తుంది. అందులో భాగంగా ఈసంవత్సరం వ్యక్తిగత మరియు సమాజం కొరకు యోగా అనే నినాదాన్ని తీసుకువచ్చారన్నారు. పూర్వం నాట్యంతో మానవాళికి ఎంతో నేర్పించారన్నారు. డిఆర్వో మధుసూధన్రావు మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకోవడం చాల సంతోషంగా ఉందన్నారు. ప్రతినిత్యం యోగ చేయడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. మనుష్యులందరు వారి దైనందిన జీవితంలో యోగాను భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. అనంతరం అంతర్జాతీయస్థాయిలో యోగా నందు గుర్తింపు పొందిన కుమారి ప్రసన్నకు, రాష్ట్రస్థాయిలో బెస్ట్ ఇనెష్నన్స్ స్టూడెంట్స్కు జ్ఞాపికలు అందించి గౌరవించారు. అనంతరం హాజరయిన అతిధులకు, కార్యక్రమానికి సహకరించిన వారికి మెమోంటోలు అందజేశారు. ఈకార్యక్రమంలో జాతీయ యోగా సంఘం సభ్యులు శ్రీదర్రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి, జిల్లా అయుష్ అఫీసరు చంద్రశేఖర్రెడ్డి, డిఎస్డిఓ భూపతిరావు, జిల్లా పంచాయితీ అధికారి నాగరాజు నాయుడు, హౌసింగ్ పిడి సిద్ద లింగమూర్తి, ఏపీ స్టేట్ యోగా అసోసియేషన్ చైర్మన్ డి లక్ష్మీకాంతరెడ్డి, సెట్కూరు సిఈఓ రమణ, డిఎంఅండ్హెచ్ఓ ప్రవీణ్కుమార్, విద్యాశాఖ ఏడి శ్యాముల్పాల్, ఎన్సిసి 28 బెటాలియన్ అడ్మిన్ అఫీసర్, మేజర్ శేషికుమార్, కెవి సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత కెవి సుబ్బారెడ్డి, సీనియర్ మెడికల్ అఫీసర్లు ద్వారం ప్రభాకర్రెడ్డి, డా.కె శ్రీనివాస్, డా.కెవిఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.